


పంపా రిజర్వాయర్ వద్ద విడుదలవుతున్న నీరు

వాన.. వరద..



- జిల్లాను ముంచెత్తిన వాన.. పొంగిపొర్లుతున్న కాలువలు
- వరదనీటి చేరికతో వేల ఎకరాల్లో పంట మునక
- ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు, సుద్దగడ్డ కాలువలు
- గొల్లప్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడుల్లో అధికంగా నష్టం
- నిండుకుండల్లా తాండవ, పంపా, సుబ్బారెడ్డిసాగర్

గొల్లప్రోలులో వరద నీటితో ఏకమైన రహదారి, పంటపొలాలు

పంపా రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో తుని మండలం గవరపేటలో నీటమునిగిన పంట పొలాలు

భారీవర్షాలు జిల్లాను ముంచెత్తాయి. వరదనీటితో పిఠాపురం నియోజకవర్గంలో సుద్దగడ్డ కాలువకు వరద పోటెత్తడంతో 2వేల ఎకరాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు నీటమునిగాయి. ప్రత్తిపాడు మండలంలోను సుద్దగడ్డ వాగు పొంగడంతో వేలాదిఎకరాలు పంటలు నీట మునిగిపోయాయి. గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో లంపకలోవలో ఆర్అండ్‌బీ రహదారిపై రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ప్రత్తిపాడు మండలం పెద్దశంఖర్లపూడిలో, ఉత్తర కంచి, ఒమ్మంగి తదితర గ్రామాల్లో వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తుండడంతో వేలాది ఎకరాలు నీటమునిగాయి. పిఠాపురంలో వర్షాలకు కొన్నిరోజులుగా ఓ పురాతన భవనం నానడంతో ఆదివారం కూలిపోయింది. అన్నవరం వద్ద పంపా రిజర్వాయర్‌కు భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో గేట్లు ఎత్తేశారు. గవరపేటతోపాటు కొన్ని గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. తునివద్ద తాండవ నది పరవళ్లు తొక్కుతోంది. ప్రత్తిపాడులో సుబ్బారెడ్డిసాగర్‌కు జలకళ సంతరించుకుంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలకు 2,540 హెక్టార్లలో వరి, 20హెక్టార్లలో పత్తి నీటమునిగింది. కాగా వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది కాగా భారీవర్షం హెచ్చరికలతో కాకినాడ జిల్లాలో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు.

నేడు కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1: వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికవర్షాలు కురిసే అవకాశంఉన్న దృష్ట్యా ఈనెల 2వతేదీ సోమవారం జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేసి నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌స్థాయి, మండలస్థాయిలోను ఈ కార్యక్రమం రద్దుచేశామన్నారు. అర్జీదారులు గమనించాలన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 1: వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు విధిగా సెలవును అమలు చేయాలని ఆయన సూచించారు.

2554 హెక్టార్లలో పంట పొలాలు ముంపు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1:జిల్లాలో 2554 హెక్టార్లలో పంట పొలాలు ముంపునకు గురైనట్లు అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీనిలో 2540హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్లు అంచనావేశారు. 14హెక్టార్లలో ప్రత్తి పంట మునిగింది.

జిల్లాలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1: జిల్లాలో గడచిన 24 గంటల్లో రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. 25.6 మి.మీ, సరాసరితో మొత్తంగా 537 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తొండంగిలో 50.4 మి.మీ., అత్యల్పంగా జగ్గంపేటలో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా సామర్లకోట 43.0, ఏలేశ్వరం 37.4, శంఖవరం 34.0, పెదపూడి 31.6, రౌతులపూడి 29.8, కాకినాడ అర్బన్ 26.8, గొల్లప్రోలు 26.8, యు.కొత్తపల్లి 25.4, ప్రత్తిపాడు 24.4, తుని 24.0, కోటనందూరు 22.6 కాకినాడ రూరల్ 21.6, తాళ్లరేవు 21.6, పెద్దాపురం 21.4, కిర్లంపూడి 21.0, పిఠాపురం 20.4, కాజులూరు 17.8, కరప 13.8, గండేపల్లి 13.4 మి.మీ వర్షం కురిసింది.


తుని వద్ద పరవళ్లు తొక్కుతున్న తాండవ నది

తాండవ పరవళ్లు

తుని రూరల్, సెప్టెంబరు 1: ఎగువన కురుస్తున్న వర్షాలకు కొండ నుంచి దిగి వస్తున్న నీరు తాండవ నదికి పోటెత్తింది. తుని కాట్రాళ్లకొండ వద్ద మినీ రిజర్వాయర్‌లో తాండవ జలాలతో పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికే రిజర్వాయర్ 338 అడుగులపైకి చేరి నిండుకుండలా దర్శనమిస్తోంది. ఏ క్షణమైనా గేట్లెత్తే అవకాశం ఉందని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిక జారీ చేశారు. తుని వద్ద మున్సిపల్ అధికారులు గట్ల పటిష్టతను పరిశీలించారు.


సుబ్బారెడ్డిసాగర్ ఎడమ కాలువవద్ద నిండిపోయిన జలాశయం

సుబ్బారెడ్డి సాగర్ జలకళ..

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1: ప్రత్తిపాడు మండలం ఈగోకవరం వద్దగల మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్‌లోకి రికార్డుస్థాయిలో వరదనీరు వచ్చి చేరింది. 85 మీటర్ల గరిష్ఠస్థాయి నీటిమట్టం కలిగిన ఈ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం నాటికి 87.30మీటర్ల మేరకు వరద నీరు చేరుకుంది. రికార్డుస్థాయిలో సాగర్ పరివాహక ప్రాంతం నుంచి తరలివచ్చిన వరద నీటితో సాగర్ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ప్రాజెక్టు నిండి అదనంగా 30సెంటీమీటర్లు జలాలు ఉన్నాయి.

ఉధృతంగా 'సుద్దగడ్డ'

- రహదారులు, పొలాలు ఏకం
- జలాశయాలను తలపిస్తున్న పంటపొలాలు
- జగనన్న కాలనీకి నిలిచిన తాగునీటి సరఫరా

గొల్లప్రోలు, సెప్టెంబరు 1: సుద్దగడ్డ వరద ఉధృతంగా మారింది. ఎగువ ప్రాంతాలనుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో గట్లు పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. రహదారులు, పొలాలు ఏకమయ్యాయి. సుద్దగడ్డకు భారీగా వచ్చి చేరిన వరద నీటితో గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారిపైకి భారీగా వరద నీరు చేరింది. ఆరు అడుగుల ఎత్తున 300 మీటర్ల పొడవునా వరద నీరు ప్రవహిస్తోంది. రోడ్డును దాటే వీలులేక పంటపొలాలు మీదుగా వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. జగనన్న కాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీరు తెచ్చేవారు లేక అందుబాటులో ఉన్న నీటినే వినియోగించుకుంటున్నారు. మధ్యాహ్నం ట్యాంకర్‌కు పైపులు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేసే ప్రయత్నాలు ఫలించలేదు. జగనన్న కాలనీ చుట్టూ వరద నీరు చేరింది. పట్టణ శివారులోని సూరంపేట జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈ ప్రాంతానికి వెళ్లే మార్గాలు అన్నింట్లో వరద నీరు ప్రవహిస్తోంది. పంటపొలాలు సుద్దగడ్డ వరద నీటిలో జలాశయాలను తలపిస్తున్నాయి. సుద్దగడ్డ వరదల కారణంగా గొల్లప్రోలు పట్టణం, పరిసర ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల్లో వరి తదితర పంటలు నీట మునిగాయి. పలుచోట్ల వరి పంటపొలాల మీదుగా సుద్దగడ్డ వరద నీరు ప్రవహిస్తోంది.

రహదారులు జలదిగ్బంధం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: మండలంలోని పలు రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుద్దగడ్డ, పుష్కర కాలువల వరద నీరు రహదారులపైకి చేరింది. గొల్లప్రోలు-తాటిపర్తి, తాటిపర్తి-చెందుర్తి పంచాయతీరాజ్ రహదారులు, వన్నెపూడి-ఎన్‌హెచ్-216 రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది.


గొల్లప్రోలు జగనన్న కాలనీకి వరద నీటిలో పొలం గట్ల మీదుగా ప్రజల రాకపోకలు


గొల్లప్రోలు మండలం చెందుర్తి-తాటిపర్తి రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

వరద ముంపులో పంటపొలాలు

పుష్కరకాలువలకు గండ్లు, సుద్దగడ్డ వరదలతో గొల్లప్రోలు మండలంలోని గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. చినజగ్గంపేట, వన్నెపూడి వద్ద పుష్కరకాలువలకు పడిన గండ్లు నుంచి నీరు పంటపొలాలను ముంచెత్తుతోంది. సుద్దగడ్డ, చౌటుకాలువల వరద ప్రభావంతో చెందుర్తి, తాటిపర్తి, లక్ష్మీపురం, మల్లవరం, కొడవలిల్లో 500 ఎకరాల్లోని వరి, పత్తి, కాయగూరలు, మిర్చి పంటలు ముంపునకు గురయ్యాయి. గండ్లు పడిన ప్రాంతాలను పుష్కర ఏఈ సురేష్ పరిశీలించారు.

ఉధృతంగా ఏలేరు

పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ



పిఠాపురం, సెప్టెంబరు 1: ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వర్షపునీటితో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కొంతకాలంగా అడుగంటిన నీటితో ఉన్న ఏలేరు కాలువలోకి ఎర్ర నీరు చేరింది. పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్యగల పిడింరొడ్డివద్ద ఏలేరు కాలువ నిండుగా ప్రవహిస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం కనిష్ఠ స్థాయి నుంచి భారీగా పెరిగింది. ఏలేరులో 83.56మీటర్ల ఎత్తులో 18.51 టీఎంసీల నీరు ఉంది. ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్లు కాగా నీటి నిల్వ సామర్థ్యం 24.11మీటర్లుగా ఉంది. ఏలేరు రిజర్వాయర్‌లోకి 9957క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వస్తుండగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 300 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. వర్షాల కారణంగా కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు.


నీటి ముంపులో 500 ఎకరాలు

సామర్లకోట, సెప్టెంబరు 1: వర్షాల కారణంగా ఎగువప్రాంతాల వరదనీరు సామర్లకోటను ఆదివారం చుట్టుముట్టింది. సామర్లకోట-పిఠాపురంరోడ్డులో ఏలేరు జలాల కారణంగా 500ఎకరాల పొలాలు నీటి ముంపులోకి చేరాయి. రాత్రికి వర్షం కురిస్తే ఈ ముంపు సమస్య మరింత పెరిగే ప్రమాదంఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కిందికి మళ్లిం చేందుకు రైతులు అర్నిశలూ శ్రమించాల్సి వచ్చింది. మెట్టప్రాంతాల్లో సాగులో ఉన్న కర్రపెండలం దుంప పంటలకు ఈ వర్షాలుతో నీటి తడులు లభిస్తాయని మెట్ట రైతులు తెలిపారు.

పిఠాపురం రోడ్డులో నీటిముంపులో వరిపొలాలు



ప్రతి ఇంటికీ కుళాయి



- మున్సిపాలిటీల్లో డ్రింక్ ఫర్ ట్యాప్(డీఎఫ్‌టీ) సర్వే ముమ్మరం
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు

సామర్లకోట, సెప్టెంబరు 1: జిల్లాలోని సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మున్సిపాలిటీలతోపాటు కాకినాడ నగరపాలక సంస్థ, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగరపంచాయతీలో డ్రింక్ ఫర్ ట్యాప్ పేరిట (డీఎఫ్‌టీ) సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించాలనే ధ్యేయంతో డీఎంఏ హరినారాయణ ఆదేశాల మేరకు పదిరోజులుగా మున్సిపాలిటీల్లో ఈ సర్వేలు ఆయా మున్సిపాలిటీల సచివాలయాల సిబ్బంది చేపట్టారు. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. మున్సిపాలిటీలవారీగా గణన చేస్తున్నారు. ఒక ఇంట్లో ఒకే కనెక్షన్ ఉంటే ఎంతమంది వినియోగించుకుంటున్నారు, కనెక్షన్ ఉందా, లేదా, లేకపోతే కారణం.. వంటి వివరాలను నమోదు చేయాల్సిఉంది. మొదట్లో సాంకేతిక ఇబ్బందులు కారణంగా అనుకున్నంత స్థాయిలో సర్వే జరపలేకపోయారు. కాగా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరు నాటికి సర్వే పూర్తిచేయాల్సిఉంది. ఈ మేరకు ఆయా మున్సిపల్ కమీషనర్లతో ప్రత్యేకంగా సమీక్షించారు.

అమృత్ 2.0 నిధులతో..

ప్రస్తుతం జిల్లాలో అమృత్ పథకం కింద పలు మున్సిపాలిటీల్లో ఫేజ్-1లో మంచినీటి పైప్‌లైన్ పనులు చేపట్టగా ప్రస్తుతం పథకం ముగిసిపోయే సమయం వచ్చింది. మరికొన్ని మున్సిపాలిటీల్లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్ బ్యాంక్ ద్వారా మంచినీటి పనులు చేపట్టే ప్రతిపాదనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సర్వే చేపట్టినట్లు మున్సిపల్ ప్రాంతీయ ఉన్నతాధికారి కార్యాలయంనుంచి సమాచారం. మున్సిపాలిటీల్లో ఎంతమందికి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఎంతమందికి లేవనే సమాచారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుంది. దీనిఆధారంగా భవిష్యత్తులో అందరికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే ప్రక్రియను చేపట్టే అవకాశం కలుగుతుంది. ఎవరైనా కనెక్షన్ వేసుకుని పన్నుల రాకపోయినా, దొంగ కనెక్షన్‌లు ఉన్నా ఈ సర్వేలో బయటపడడంతో వాటిని రెగ్యులర్ చేసి మున్సిపాలిటీకి ఆదాయవనరులు పెంచే అవకాశాలున్నాయి.

మున్సిపాలిటీలవారీగా సర్వే వివరాలు

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	పూర్తయినవి	శాతం
కాకినాడ	87,465	84,038	96.08
సామర్లకోట	15,850	15,636	98.65
పెద్దాపురం	14,460	13,760	95.16
పిఠాపురం	15,934	15,934	100.00
తుని	13562	13,499	99.54
గొల్లప్రోలు	5,924	5,898	99.56
ఏలేశ్వరం	7,260	7,259	99.99

బదిలీలకు 15 వరకు గడువు

- పలు శాఖల్లో ప్రారంభం కాని ప్రక్రియ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 1: ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నేటికీ పలుశాఖల్లో కసరత్తు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారంతో బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా సిఫార్సు లేఖలు తెచ్చుకోలేకపోయిన వారికి మరో అవకాశం రావడంతో వారు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేస్తున్నారు. కాగా ఇతర జిల్లాలనుంచి సిఫార్సు లేఖలతో వచ్చే వారికోసం, ఇక్కడినుంచి బదిలీ కోరుకోని వారిని ఇబ్బంది పెట్టొద్దని ఉద్యోగ సంఘాల నాయకులు జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. క్లాస్-4 మొదలుకుని మండల స్థాయి వరకు బదిలీలు కోరుకుంటున్న ప్రతి ఉద్యోగి, అధికారి, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లేఖలు తెచ్చుకుంటున్నారు. బదిలీ దరఖాస్తుతోపాటు ఈ సిఫార్సు లేఖలను జత చేసి పంపుతున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి.



చినశంకర్లపూడిలో ఇండియన్ ఈగల్ ఓవెల్

ప్రత్తిపాడు/ఏలేశ్వరం, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా చినశంకర్లపూడిలో చెనుబోయిన వేణు ఇంటి వద్ద అరుదైన పక్షి కనిపించింది. కోతులు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడి ఎగురలేని స్థితిలో కొట్టుమిట్టాడు తుండగా స్థానికులు ఏలేశ్వరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఏలేశ్వరం డీఆర్వో శ్యాంసన్ వచ్చి ఈ పక్షిని స్వాధీనం చేసుకున్నారు. గుడ్లగూబ, గ్రద్ధ మాదిరిగి కనిపిస్తున్న ఈ పక్షి శాస్త్రీయ నామం ఇండియన్ ఈగల్ ఓవెల్ అని ఆయన చెప్పారు. బెంగాల్ అటవీ ప్రాంతంలో ఈ జాతి పక్షులు కనిపిస్తాయని, మన రాష్ట్రంలో కనిపించడం అరుదన్నారు. నీరసంగా ఉండడంతో ఎగురలేకపోతోందని, ఆహారం సమకూర్చి ఎగిరే వరకు విశ్రాంతి కల్పిస్తామన్నారు. చెప్పారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ పక్షిని పంజరంలో భద్రపరిచి ఏలేశ్వరంలోని అటవీ సందర్శన కార్యాలయానికి తరలించారు. అక్కడ వైద్యం చేసి లింగంపర్తి అడవిలో విడిచిపెట్టారు.



మూడు పతకాలు సొంతం చేసుకున్న మధు చందన

మధు చందనకు పతకాల పంట

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన మధు చందన వెయిట్ లిఫ్టింగ్‌లో ఏక కాలంలో మూడు పతకాలు కైవసం చేసుకుంది. చింతూరు కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మధుచందన అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. ప్లస్-81 కేటగిరీ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం, సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

భర్త, తోటి కోడలికి గాయాలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో విద్యుత్ షాక్‌తో ఆదివారం ఒక మహిళ మరణించగా, భర్త, తోటికోడలికి గాయాలయ్యాయి. గ్రామంలోని రాణా వారి వీధిలో నివాసముంటున్న పోలవరపు నూకరత్నం(55) ఇంటిలో తడిసిన బట్టలను ఆరేస్తోంది. ఆ సమయంలో ఆ తీగకు కరెంటు ప్రవహించడంతో విద్యుత్ షాక్‌కు గురయింది. వెంటనే నూకతర్నం కేకలు వేయడంతో భర్త నారాయణరావు, తోటి కోడలు సత్యవతి వచ్చి ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తుండగా వారు కూడా షాక్‌కు గురయ్యారు. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నూకరత్నం మరణించింది. మిగిలిన వారు చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

అయినవిల్లి మండలం సిరిపల్లిలో...

అయినవిల్లి, సెప్టెంబరు 1: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిసా రాష్ట్రం నబుగాన్ నవరంగ్‌పూర్ జిల్లా కారగాన బార్‌జాన్ గ్రామానికి చెందిన బలరాం హరిజన్ (22) ఏపీలోని కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం సిరిపల్లికి చెందిన వాసంశెట్టి గిరిధర్ రొయ్యల చెరువు వద్ద పని చేస్తున్నాడు. హరిజన్ శనివారం రాత్రి జనరేటర్ వేశాడు. కరెంటు రావడంతో జనరేటర్ నిలుపుదల చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది దులార్ హరిజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కేఎం జోషి తెలిపారు.

కూనవరం మండలం మర్రివీడులో...

కూనవరం, సెప్టెంబరు 1: మండలంలోని మర్రివీడుకు చెందిన ఆవుల వెంకటరమణ (28) ప్రయివేటుగా విద్యుత్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై పడిపోయాడు. కోతులగుట్ట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కాలు జారి చెరువులో పడి యువకుడు మృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనబాద్‌ఎస్సీ పేటకు చెందిన కాకాడ లోవరాజు(29) పెయింటింగ్‌లు వేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం కాళ్లు కడుక్కోవడానికి చెరువులోకి దిగి కాలు జారిపడ్డాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయింది. ఈత రాకపోవడంతో లోవరాజు ఊపిరాడక మృతి చెందాడని అతడి మేనమామ పలివెల నానిబాబు తెలిపారు. మృతుడికి సంవత్సరంలోపు పాప ఉందని, భార్య ఆరో నెల నెల గర్భిణి అని ఆయన చెప్పారు.

వర్షం కారణంగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. గన్నవరం వద్ద రైల్వే ట్రాక్ నీట మునగడంతో కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలును రాజమహేంద్రవరంలో రద్దు చేశారు. రైల్వే అధికారుల ఆకస్మిక నిర్ణయంతో దారి మధ్యలోనే ప్రయాణం ఆగిపోవడంతో ప్రయాణికులు ఉసూరుమన్నారు.



నిలిచిపోయిన తిరుపతి రైలు... వెనుదిరుగుతున్న ప్రయాణికులు

తిరుపతి రైలు ఆకస్మిక రద్దు

- రాజమహేంద్రవరంలో నిలిపివేత
- 1,500 మంది ప్రయాణికుల ఆగచాట్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు కాకినాడలో ఆదివారం సాయంత్రం బయల్దేరింది. ఐదు గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంది. ఎంతసేపటికీ బయలుదేరకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. రైలును దారి మళ్లిద్దామనుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు వెళ్లే ప్రయాణికులు దిగిపోవాలని చెప్పారు. కానీ రైలును రద్దు చేస్తున్నట్టు 6.30 గంటల సమయంలో ప్రకటించారు. 11 స్లీపరు, 6 ఏసీ, రెండు జనరల్ బోగీల్లో సుమారు 1,500 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లేవారే. రైలు ఆకస్మిక రద్దు ప్రకటనతో దర్శనం కోల్పోయామనే బాధ ప్రయాణికుల్లో కనిపించింది. కొందరు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. టీసీఐ చంద్రమౌళి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించినట్లే రైలును ఆకస్మికంగా దారి మధ్యలో నిలిపేస్తే తమకూ పరిహారం చెల్లించాలని వాదించారు.

రిఫండ్‌కీ ఇబ్బందే...

మాన్యువల్‌గా రిజర్వేషను టికెట్లు తీసుకున్న వాళ్లు రిఫండ్ కోసం రిజర్వేషను కౌంటర్ల వద్దకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. అయితే అక్కడ మూడే కౌంటర్లు ఉండడం, రాజమండ్రి రిజర్వేషను కార్యాలయంలో తీసుకున్న టికెట్లను మాత్రమే రద్దు చేస్తామని చెప్పడంతో ప్రయాణికులు మరింత నీరసించిపోయారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి ఘోరం. తిరుగు ప్రయాణంలో టికెట్లు ఉన్నవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ టికెట్లకు క్యాన్సిలేషన్ చార్జీలు వసూలు చేయకుండా చూడాలని కోరారు.



రిజర్వేషను రద్దు డబ్బుల కోసం ప్రయాణికుల పాట్లు

సేవ కోల్పోయాం: రోహిణి, కాకినాడ



వేంకటేశ్వరుడి సేవకు తొమ్మిది నెలలుగా ప్రయత్నిస్తే ఇప్పుడు అవకాశం లభించడంతో జన్మ ధన్యమైందని సంబరపడ్డాం. 15 మంది బృందంగా బయల్దేరాం. సోమవారం ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాల్సి ఉంది. కానీ దారి మధ్యలో ఆగిపోయాం. మళ్లీ ఐదు నెలల దాకా మాకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. దారి మళ్లించి అయినా తీసుకెళితే బాగుండేది.

ఎటు వెళ్లాలో తెలియట్లేదు



వీవీ సత్యనారాయణ, రామచంద్రపురం

ఎప్పటి నుంచో తిరుమల వెళ్లాలని అనుకుంటున్నాం. దర్శనం, వసతి దొరకలేదు. జూన్ 24న దొరికాయి. సోమవారం దర్శనం ఉంది. కానీ రైలును అకస్మాత్తుగా ఆపేశారు. ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లాలో తిరుపతి వెళ్లాలో తెలియట్లేదు. భార్య, బిడ్డలతో ఇబ్బంది పడుతున్నాం. ముందుగా సెల్‌ఫోన్‌కి మెసేజ్ పంపిస్తే కొంత ఇబ్బంది ఉండేది కాదు.

కొన్ని రద్దు... మరికొన్ని దారి మళ్లింపు

రైలు ప్రయాణికులకు తప్పని అవస్థలు



సామర్లకోట రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

సామర్లకోట, సెప్టెంబరు 1: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు విజయవాడ రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను నిర్దేశిత రూట్లలో కాకుండా వేరే రూట్లకు డైవర్షన్ చేశారు. రైల్వే ఎస్టీఎం చార్ట్ అధికారి రాజనరసు కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆదివారం మధ్యాహ్నం ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట చేరుకోవాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముందుగా రిజర్వేషన్ టిక్కెట్లు పొందిన వారికి చార్జీలను వాపసు చేశారు. రైళ్ల రాకపోకలకు చెంది ప్రత్యేక సమాచారం అందించేందుకు ప్లాట్‌ఫామ్-1పై హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఆదివారం రద్దు అయిన రైళ్ల వివరాలు...

హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
విశాఖ-హైద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-ఎల్‌టీటీ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-మహబూబ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
భువనేశ్వర్-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న రద్దు చేశారు.

టాటానగర్-యశ్వంత్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే వారాంతపు ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఎగువ ప్రాంతా ల్లో కురిసిన భారీ వర్షాలకు రైల్వే ట్రాక్ నీటి ముంపు కారణంగా సిగ్నలింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయలేదు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి పలు రైళ్ల రాకపోకల్లో గంటల తరబడి ఆలస్యం జరిగింది. కొన్ని రైళ్లను నిర్దేశిత వేగం కన్నా తగ్గించి నడుపుతుండడంతో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. సామర్లకోటలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లో ముగ్గురు సిబ్బందిని నియమించి నిరంతరం సమాచారం అందించేందుకు 0884-2327010 నంబరు కేటాయించారు.

విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాత్రి 7.02 గంటలకు సామర్లకోట చేరుకుంది. నూజివీడు-విజయవాడ మధ్య ట్రాక్ ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో సామర్లకోటలో 2.20 గంటల పాటు నిలుపుదల చేశారు. రాత్రి 9.27 గంటలకు తిరిగి విశాఖపట్నం పంపించారు.



ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అధిక వర్షాలతో కాలువల ద్వారా వరద నీరు సముద్రంలోకి పోటెత్తుతోంది. కెరటాలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్యకారులు వేటను స్వచ్ఛందంగా విరమించారు.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల మధ్య ముకునూరు వద్ద ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

పొంగిపొర్లిన వాగులు

పరిస్థితిని సమీక్షించిన ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, సెప్టెంబరు 1: ఒకపక్క ఎడతెరపిలేని వర్షం... మరోపక్క ఉధృతంగా గోదావరి, శబరి నదులు... ఇంకోపక్క పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలాన్ని వరద చుట్టుముట్టింది. కల్లేరు, పెద్దసీతనపల్లి, ముకునూరు, రామన్నపాలెం, ఎజికొడేరు పంచాయతీల పరిధిలోని 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. సోకిలేరు, చీకటి వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో చింతూరు, వరరామచంద్రపురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం 35.5 అడుగులకు చేరింది. వరద పరిస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సమీక్షిస్తున్నారు. సోకిలేరు, చీకటివాగు ఉధృతిని ఆయన స్వయంగా పరిశీలించారు. చింతూరు నుంచి ఎజికొడేరు వెళ్లే ఆదివాసీలు జల్లివారిగూడెం వద్ద వాగు దాటేందుకు పడుతున్న అవస్థలను చూశారు. అప్పుడే పెరుగుతున్న వాగు మీదుగా వారందరినీ తన వాహనంలో దాటించారు. ఘాట్‌పై కొండచరియలు, చెట్లు విరిగిపడే ప్రమాదముందన్న కారణంతో రాత్రి సమయంలో చింతూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



తుమ్మిరిగూడెం వాగు వద్ద ఆదివాసీలను తన వాహనంలో దాటిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



రాజానగరంలో డిజిటల్ క్లాస్ రూమ్‌గా రూపుదిద్దుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రం

అభిమానం నిండుగా... అభివృద్ధికి అండగా..

- పవన్‌కల్యాణ్ అభిమానుల వినూత్న ఆలోచన
- రాజానగరం అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు
- 'క్లీన్ పిఠాపురం... గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి కడియం నుంచి మొక్కలు

రాజానగరం/కడియం, సెప్టెంబరు 1: తమ అభిమాన హీరో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన యువకులు వినూత్నంగా ఆలోచించారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా నడుచుకుందామనుకున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నా కొందరు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకపోవడాన్ని గుర్తించారు. చిన్నారులను ఆకర్షించేలా స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు అద్దాలని సంకల్పించారు. తమలో ఒకరైన ఎన్ఆర్ఐ స్నేహితుడితో ఆ ఆలోచనను పంచుకున్నారు. పుట్టినరోజు వేడుకలకు చేసే రూ.50వేల ఖర్చుతో డిజిటల్ తరగతి గది రూపకల్పనకు అవసరమైన డిజిటల్ పరికరాలు, ఆటబొమ్మలు సమకూర్చారు. సోమవారం దీనిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో ప్రారంభింపచేసేందుకు సిద్ధం చేశారు.

కడియం నుంచి చిరు సేవా సమితి అధ్యక్షుడు, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ గెడ్డం శివరత్నగణపతి రూ.4 లక్షలు విలువ చేసే 12వేల మొక్కలను ఉచితంగా అందజేశారు. రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ తలపెట్టిన వన మహోత్సవంలో భాగంగా 'క్లీన్ పిఠాపురం.. గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి ఫల, అటవీ శాఖ మొక్కలు పంపుతున్నట్టు శివ వివరించారు.



పిఠాపురానికి మొక్కలు పంపుతున్న శివ

మరో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న తల్లిదండ్రులు
- పలు కారణాలు చెప్తున్న వైద్యులు

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో ఆదివారం ఆరు రోజుల వయసు గల మరో శిశువు మృతి చెందింది. సరివెలకు చెందిన కణితి చిలకమ్మకు ఆగస్టు 27న పురిటి నొప్పులు రావడంతో వెంటనే ఆమె భర్త దుర్గారావు, అత్త లక్ష్మి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చిలకమ్మ ఆదే రోజు మగ శిశువుకు జన్మనిచ్చింది. 30న శిశువు కడుపు ఉబ్బుగా ఉందని గుర్తించిన వైద్యులు ప్రత్యేక వార్డులోకి మార్చారు. మరుసటి రోజు కూడా బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో వైద్యులు ఆది వారం రాత్రి పదకొండు గంటల సమయంలో మెరుగైన చికిత్స అవసరమని భావించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రంతా ప్రత్యేక వార్డులో ఉంచిన అక్కడి వైద్యులు ఆదివారం ఉదయం శిశువు పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ తరలించాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. అయితే వర్షాల కారణంగా భద్రాచలం నుంచి వరంగల్ వెళ్లేందుకు రహదారి సౌకర్యం సక్రమంగా లేదని తెలుసుకున్న తల్లిదండ్రులు తమ బిడ్డను హైదరాబాద్ తరలించేందుకు సిద్ధపడి అంబులెన్సు సిద్ధం చేసుకున్నారు. ఈలోపు బిడ్డ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై తల్లిదండ్రులు మాట్లాడుతూ చింతూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తమ బిడ్డ ఆరోగ్య పరిస్థితిని సకాలంలో గుర్తించకపోవడంతో చికిత్స చేయించే సమయం దొరక్క మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ముందుగానే చెప్పి వుంటే ఎంతైనా ఖర్చు చేసి తమ బిడ్డను బతికించుకునేవాళ్లమంటున్నారు.

ఈ విషయమై వైద్యుడు ఉమర్ వివరణ ఇస్తూ... బిడ్డకు పచ్చకామెర్లు, జ్వరంతో పాటు మలద్వార నిర్మాణం సక్రమంగా లేదన్నారు. మలం బయటకు వెళ్లే చోట ఆటంకం కలిగి మృతి చెందిందన్నారు.





మృతి చెందిన శిశువు, మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు చిలకమ్మ దుర్గారావు, నానమ్మ లక్ష్మి



పంపా వరద గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న నీరు

పంపా రిజర్వాయరు నుంచి 2వేల క్యూసెక్కులు సముద్రంలోకి

అన్నవరం, సెప్టెంబరు 1: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కు ఎగువ ప్రాంతాల నుంచి పంపా రిజర్వాయరుకు నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో రెండో నంబరు వరదగేటు ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాల పంట పొలాలు మునిగిపోయాయి. మరోపక్క వరద నీటి ప్రవాహం జాతీయ రహదారిపై ఉన్న నూతన నమూనాలయం వద్దకు చేరడంతో చుట్టూ ప్రహరీ నీటితో నిండిపోయింది. దీంతో జాతీయ రహదారిపైకి వరద నీరు ప్రవహించే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో జాతీయ రహదారిపై ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పంపా నీటిమట్టం 99 అడుగులు ఉంది.



జాతీయ రహదారిపై నమూనాలయం ప్రహరీ చుట్టూ నీరు



రాత్రి వేళ తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మూసివేత

మోతుగూడెం, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ తులసిపాక నుంచి మారేడుమిల్లి వెళ్లే ఘాట్ రోడ్డును మూసివేస్తున్నట్టు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. కొండచరియలు విరిగిపడే అవకాశం వున్న నేపథ్యంలో ఈ ఘాట్ రోడ్డులో వాహనాలను అనుమతించమన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అత్తను చంపిన కోడలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 1: మండలంలో వృద్ధురాలైన అత్తను కోడలు హతమార్చింది. రాజవొమ్మంగి సీఐ సన్యాసి నాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కొండపల్లి గ్రామానికి చెందిన ఈక లక్ష్మి(65)ని ఆమె కోడలు జ్యోతి హత్య చేసింది. నిత్యం తనకు అక్రమ సంబంధాలు అంటకడుతోందనే కోపంతో జ్యోతి అత్త లక్ష్మిని బలంగా కొట్టడంతో చనిపోయింది.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: దుర్గాడ శివాలయంలో మాసశివ రాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆగమ పండితుడు గణపతిశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పారాయణ, సూర్య నమస్కారాలు, రుద్రహోమం, 11 రకాల ద్రవ్యాలు, 11 రుద్రాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చె రుకూరి వీరబాబు, దత్తులు పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. సప్తహారతులు సమర్పించారు.

కాకినాడ

వర్షం ముంచేసింది!

జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు

నీట మునిగిన పంట పొలాలు

ఆందోళనలో రైతులు

అధికారులు, నాయకుల పరిశీలనలు



తొండంగి: కొమ్మనాపల్లిలో నీట మునిగిన పంట పొలాలు, కొత్తపల్లి: కొమరగిరిలో మునిగిన సార్వా వరిచేలు, కిర్లంపూడి: వేలంకలో వర్షం నీరు

తొండంగి, సెప్టెంబరు 1: గత 2 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, తహశీల్దార్ మురార్జీ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. పంపా రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడం వల్ల దిగువనున్న పి.అగ్రహారం పంట పొలాలు, గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో ఆర్డీవో గ్రామస్తులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యానశాఖాధికారి విజయలక్ష్మి ఉద్యాన పంటలను పరిశీలించి భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కొమ్మనాపల్లిలో వరి పంట పొలాలు, చెరువును తలపించేలా ఉన్నాయి. ఎ.కొత్తపల్లి ఆవలో వందలాది ఎకరాల వరి.. కోదాడ కృష్ణాపురం, తొండంగి తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగింది.

కొత్తపల్లి: భారీ వర్షాలకు కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో సార్వా వరిచేలు నీట మునిగాయి.



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో నీట మునిగిన వరి చేలు

గోర్స, కొమరగిరి, ఆనందనగరం, కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో సార్వా పంట ముంపునకు గురైంది. భారీ వర్షాలకు తోడుగా పంట కాలువల ద్వారా ఎగువ నుంచి విడుదలైన వరద నీటిని కిందికి వదలంతో కాలువలు పొర్లి వరిచేలల్లోకి నీరు చేరడంతో వరి పంటపూర్తిగా మునిగింది. కొన్నిప్రాంతాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం వర్షం కురవకపోవడంతో పలు గ్రామాల్లో వరిచేలు కొసలు పైకి కనిపిస్తున్నాయి. రాత్రికి వర్షం కురవకపోతే చాలా వరకు చేలు నీటి ముంపు నుంచి తేరుకుంటాయని రైతులు చెబుతున్నారు.

కిర్లంపూడి: ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలో పాలెం, సోమరాయణంపేట, గోనేడ, బూరుగుపూడి గ్రామాల్లో సుమారు 150 ఎకరాలకు పైబడి పంట పొలాలు నీట మునిగాయి. వేలంక, సింహాద్రిపురం ఎస్సీ కాలనీల్లోకి వర్షపునీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వేలంకలో తహశీల్దార్ చిరంజీవి కాలనీల్లో తిరిగి బాధితులను వివరాలు తెలుసుకున్నారు. మిగతా గ్రామాలు సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్తిపాడు: భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు అతలాకుతలం అయ్యాయి. కాలువలు, చెరువులు పొంగి ప్రవహించడంతో పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి, జగన్నాధపురం, ఏలూరు, చినశంకర్లపూడి, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో 600 ఎకరాలు పైబడి వరి చేను నీటి ముంపునకు గురైంది. నూతనంగా సాగు చేపట్టిన పామాయిల్, సర్వే తోటలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో సుద్దగడ్డవాగు తీవ్రస్థాయిలో పొంగి ప్రవహిస్తుండటంతో రాయవరం, ప్రత్తిపాడులో వరి పంట పొలాలు నీటి ముంపు బారినపడ్డాయి. పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుని రూరల్: అన్నవరం పంపా రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం తుని రూరల్ గవరపేటకు తాకి వందలాది ఎకరాల వరిపంట ముంపునకు గురైంది. చామవరం, హంసవరం, తిమ్మాపురం గ్రామా ల్లో ప్రత్తిపంటను వర్షం నీరు ముంచెత్తగా తాండవ పరివాహక గ్రామాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

పిఠాపురం రూరల్: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా మండలంలో సుమారు 350 ఎకరాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. పిఠాపురం బైపాస్‌రోడ్డు, జములపల్లి, నరసింగపురం, ఇల్లిం ద్రాడ, తదితర గ్రామాల్లోని వరిపొలాల్లోకి వర్షపునీరు చేరింది. ఆలస్యంగా వరినాట్లు వేసి పొలాల్లో పంట దెబ్బతిన్నది.

సర్పవరం జంక్షన్: వర్షాలకు కాకినాడ రూరల్ పండూరు, నేమాం, తమ్మవరం, తిమ్మాపురం, సూర్యారావుపేట గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను జనసేన పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ పరిశీలించారు. వర్షాలకు నీట మునిగిన రైతుల పంట పొలాలను పరిశీలించాలని ఎమ్మెల్యే నానాజీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలోకెళ్లి ముంపు బారిన పడ్డ పొలాలను పరిశీలించినట్లు సందీప్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నందిపాటి త్రిమూర్తులు, నందిపాటి రమణ, మాదారపు తాతాజీ, చోడిశెట్టి ఇంద్ర, పోసిన రాము, దాసరి శివ, సోది మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు జగనన్న కాలనీలోని వరద బాధితులకు జనసేన నేత గొల్లపల్లి పెదబాబి ఆహార ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

స్తంభించిన రాకపోకలు



వెంకన్న దొర చెరువు ఆర్అండ్‌బీ రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో నిలిచిన రాకపోకలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1: మండలంలో పెదశంకర్లపూడి వెంకన్న దొర చెరువు ఆదివారం పొంగి ప్రవహిస్తుండంతో ఏలేశ్వరం ఉత్తరకంచి ఆర్అండ్‌బీ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులోకి ఎర్రకాలువ, సాగర్ కాలువల గుండా పెద్ద ఎత్తున వరదనీరు తరలిరావడంతో ఈ చెరువు పొర్లు కట్టడం మీదుగా అడుగున్నర ఎత్తులో ప్రవాహం తరలిస్తుంది. దీంతో పెదశంకర్లపూడి వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై భారీ ఎత్తున ప్రవాహం బయటకు తరలిరావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. చెరువు నుంచి చేపలు వరద నీటితో తరలిరావడంతో పెదశంకర్లపూడి యువత పొర్లు కట్టడం వద్ద చేపల వేటలో తలమునకలయ్యారు.

కూలిన పురాతన భవనం

పిఠాపురం, సెప్టెంబరు 1: పిఠాపురంలో పురాతన భవనం ఆదివారం కూలిపోయింది. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే గోల్డ్‌మార్కెట్ సెంటర్‌లో ఉన్న పురాతన భవనం ఒకవైపు కూలింది. భారీవర్షాల కారణంగా గోడలు నాని కూలిపోయినట్లు భావిస్తున్నారు. ఆదివారం షాపులన్నీ మూసి ఉండడం, జనసంచారం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఇందులో ఆసుపత్రి నిర్వహించేవారు. ప్రస్తుతం భవనం నిరుపయోగంగా ఉంది. పాక్షికంగా కూలిన ఈ భవనాన్ని పూర్తిగా తొలగించాలని, లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని సూచిస్తున్నారు.



పిఠాపురంలో కూలిన పురాతన భవనం

శ్రీపాదశ్రీవల్లభ జయంతి ఉత్సవాలు ప్రారంభం



శ్రీపాదశ్రీవల్లభులకు సర్వపుష్పపూజ అనంతరం విశేష అలంకారం

పిఠాపురం, సెప్టెంబరు 1: దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థానంగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వారం పాటు ప్రత్యేక పూజలు, కార్య క్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు తొలిరోజున శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు సర్వపుష్పపూజ నిర్వహించారు. అనంతరం పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, తీర్థప్రసాద వినియోగం, రుత్విక్కులచే దత్త మూల మంత్ర అనుష్ఠానము, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీ గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాదపద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఆర్.సౌజన్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : మంత్రి సుభాష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

తాళ్లరేవు, సెప్టెంబరు 1: టీడీపీ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, శెట్టిబలిలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండల శెట్టిబలిజ సంఘం నేత టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన సూర్య భాస్కర కల్యాణమండపంలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మంత్రి, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును ఘనంగా సత్కరించారు. ముందుగా ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతూ శెట్టిబలిజ సోదరులు తాళ్లరేవులో బైక్‌ర్యాలీ నిర్వహించారు. మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, శెట్టిబలిజ నేతలు గుత్తుల సాయి, కట్టా త్రిమూర్తులు, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, సూరంపూటి కుమార్, అత్తిలి బాబూరావు, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి వినోద్ పాల్గొన్నారు.

తెలుగు భాషకు ప్రపంచస్థాయిలో గుర్తింపు : చిక్కాల

పోర్టుసిటీ(కాకినాడ), సెప్టెంబరు 1: తెలుగుభాష, సంస్కృతులకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. కల్పన సెంటర్ రోటరీ హాల్‌లో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురికి తెలుగుతేజం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో జరిగిన సభకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. డాక్టర్ బడే గోవిందరావు, డాక్టర్ రాయవరపు సత్యభామ, డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, సెప్టెంబరు 1: రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దోహదపడాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని ఆసుపత్రి ప్రాంగణంలో అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆమె సభ్యులతో ప్రమాణ స్వీకారం అనంతరం మొదటి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అవసరాలు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. రోగులు వేచి ఉండే సమయాన్ని డాక్టర్లు తగ్గించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ గంట్ల సత్యనారాయణ, డాక్టర్ సుబ్బారావు, తటపర్తి రాజా, విజయ్, ఆర్డీవో సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి అభివృద్ధి : వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 1: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానం లభిస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. చంద్రబాబు తొలిసారి సీఎం అయి 3దశాబ్దాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పిఠాపురం టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఏ విధమైన సంబరాలు చేయడం లేదని తెలిపారు. చంద్రబాబుతో తాను 22 ఏళ్లుగా ప్రయాణం చేస్తున్నానని, ఆయన ఆశీస్సులతో పిఠాపురం నియోజకవర్గాన్ని రూ.2,500కోట్లుతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పాతపెన్షన్ విధానం అమలుచేసే వరకూ పోరాటం'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 1: పాతపెన్షన్ విధానం అమలుచేసేవరకూ పోరాడతామని దాని పునరుద్ధరణే తమ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోర్తశ్రీనివాస్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆదివారం జీపీఎస్, సీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరుతూ సెప్టెంబర్ 1ని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట పెన్షన్ విద్రోహదినంగా నిరసన తెలిపారు. ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, నాయకులు సత్యనారాయణ, శ్రీను, శివప్రసాద్, సుబ్బరాజు ఉన్నారు.

నేడు సూర్యారావుపేట బీచ్‌లో పరిశుభ్రత

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని సోమవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం 4 గంటలకు బీచ్‌కు రావాలని,తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 1: సోమవారం కాకినాడలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని వర్షాల కారణంగా రద్దు చేసినట్టు నిర్వహించనున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు.

నేడు డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం

జగ్గంపేట, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జగ్గంపేటలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ క్యాంటీన్ సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభకానుంది.

కాండ్రకోటలో పసర పండుగ

పెద్దాపురం, సెప్టెంబరు 1: కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో పసర పండుగ (రైతు పండుగ)ను గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంటలు సుభిక్షంగా పండాలని ఈ పండుగను నిర్వహించడం ఇక్కడ అనాధిగా వస్తున్న ఆచారం.

బొలెరో ఢీ కొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతిచెందిన సాయి మణికంఠ

జగ్గంపేట, సెప్టెంబరు 1: జగ్గంపేట మండలం రామవరం వద్ద బొలెరో వాహనం అతివేగంగా ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్రగాయ్యాయి. జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం ఉదయం 5గంటలకు అనపర్తి మండలం లక్ష్మీపురానికి చెందిన కోనాల సాయి మణికంఠ రెడ్డి, నల్లమిల్లి శివారెడ్డి అనపర్తి నుంచి నర్సీపట్నం వెళ్తూ మార్గమధ్యలో రాయవరం గ్రామ శివారున మూత్ర విసర్జనకు బండి పక్కన ఆపారు. దీంతో వెనుక నుంచి వస్తున్న టీఎస్ 09యూడీ 5239 నెంబరు గల బొలెరో వాహనం డ్రైవర్ అతివేగంగా ఢీకొనడంతో మణికంఠ రెడ్డి(25) రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శివారెడ్డికి తీవ్ర గాయాలు కాగా జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద జాతీయరహదారి 16 సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. వయస్సు 35-40ఏళ్ల ఉంటుంది. వివరాలు తెలియరాలేదని గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

పాదయాత్రకు సంఘీభావం

పిఠాపురం, సెప్టెంబరు 1: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ విజయవాడకు చెందిన యువకులు ఆకేటి బుజ్జిబాబు, దంతా రాధాకృష్ణ విజయవాడ నుంచి కోల్‌కత్తా వరకూ పాదయాత్ర చేపట్టారు. వీరు పాదయాత్రగా ఆదివారం పిఠాపురం పట్టణం చేరుకోగా ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ప్రతినిధులు వారిని కలిసి సంఘీభావం తెలిపారు. ప్రతినిధులు వెలగా వెంకట నగేష్, బోడా సతీష్, ఇమ్మిడిశెట్టి నాగేంద్ర,తాతాజీ పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం

కరప, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురష్కరించుకుని నడకుదురు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జనసేన మెగా ఉచిత వైద్యశిబిరం జరిగింది. సుమారు వెయ్యి మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది కళ్ల పరీక్షలు చేసి ఆపరేషన్‌లు అవసరమైనవారిని గుర్తించారు. హైస్కూల్ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటి నీళ్లు పోశారు. యంగ్ మైండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ, నరాల కృష్ణకుమార్, డీవీవీ బాపిరాజు, కామేష్‌లు వైద్యపరీక్షలు చేసిన వైద్యులను సత్కరించి మెమెంటోలను అందజేశారు. క్యాంప్ కో-ఆర్డినేటర్లు భాస్కర్, సుబ్బు, వెంకటేష్, శేఖర్, మెండు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గొల్లప్రోలు, సెప్టెంబరు 1: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ కామరాజు, రీజియన్ చైర్మన్ కంతేటి లక్ష్మీనారాయణ, కుసుమించి పాపారావు, గ్రంధి లచ్చన్న, దంగేటి రామకృష్ణ, కేదారశెట్టి చలపతిరావు, పూరా సుబ్బారావు, పిరాట్ల శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు నివారణకు ప్రాజెక్టు రూపకల్పన

ఎమ్మెల్సీ హరిప్రసాద్



గొల్లప్రోలు జగనన్న కాలనీ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

గొల్లప్రోలు, సెప్టెంబరు 1: ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు నుంచి పిఠాపురం నియోజకవర్గాన్ని కాపాడేందుకు వేయి కోట్ల రూపాయిలతో ప్రాజెక్టు రూపకల్పన చేస్తున్నట్టు ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడుగులు వేస్తున్నారని, ఇప్పటికే జిల్లా కలెక్టరుతో మాట్లాడటం జరిగిందని చెప్పారు. సుద్దగడ్డ వరదల కారణంగా ముంపునకు గురైన గొల్లప్రోలు జగనన్న కాలనీకి వెళ్లే రహదారి, పంటపొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. త్వరలోనే ముంపు సమస్య పరిష్కారమవుతుందన్నారు. జగనన్నకాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు వీలుగా పడవ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భోజనాలు, తాగునీటి అవసరాలను తీర్చాలని స్థానిక నాయకులు, అధికారులకు సూచించామని చెప్పారు. వరద, వర్షాలు తగ్గిన వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితుల కోసం తక్షణ ఉపశమన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో అందుబాటులో ఉన్న జనసేన నాయకులతో హరిప్రసాద్ సమావేశమయ్యారు. పవన్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

'అప్రమత్తం చేస్తున్నాం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన పరిస్థితుల్లో మత్స్యకార గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ తమ్ముడోల శంకర్ వెల్లడించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొండబాబు శాలువాతో కమిషనర్‌ను సత్కరించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల పరిస్థితి తదితర అంశాలపై చర్చించారు. ఆయనతోపాటు జనసేన రాష్ట్ర నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యకార నాయకుడు ప్రెసింగి ఆదినారాయణ పాల్గొన్నారు.



కొండబాబుతో మాట్లాడుతున్న శంకర్

ముగిసిన మెగా బూట్ క్యాంప్

గండేపల్లి, సెప్టెంబరు 1: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీలో 2 రోజుల పాటు నిర్వహించిన మెగా బూట్ క్యాంప్ ముగిసింది. యువతకు ఉజ్వల భవిష్యత్‌ను ఇచ్చే శాస్త్ర సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడంలో చైతన్యవంతులు కావాలని ఆదిత్య వీసీ ఉపకులపతి డాక్టర్ ఎంబి శ్రీనివాస్ సూచించారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ పాల్గొన్నారు. ఆదిత్యలో ఫోరెనిక్స్ సైన్స్ విభాగం 2024-25 విద్యా సంవత్సరానికి కొత్త బ్యాచ్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఫోరెనిక్స్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో డీఎస్పీ తనిఖీ

గొల్లప్రోలు, సెప్టెంబరు 1: గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌ను కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నా రు. అంతకు ముందు గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు.

దేశాభివృద్ధిలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు కీలకపాత్ర : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 1: దేశాభివృద్ధిలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. భారతదేశ ఎగుమతులు 45 శాతం వాటాతో సుమారు 15 కోట్ల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఐదేళ్లలో సుమారు 3 వేల మంది యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేసేలా రుణాలిచ్చేందుకు ముందుకువచ్చిందని యువత సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ రూరల్ రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అసోసియేషన్‌లో స్మాల్ ఇండస్ట్రీస్ డవలెప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (సిడ్బీ) వెస్టరన్ జోన్ సీజీఎం సంజయ్ గుప్తా ఆధ్వర్యంలో మైక్రో స్మాల్ మీడియా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) క్లస్టర్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌పై నిర్వహించిన అవగాహనలో ఎంపీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తాను కలసి కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌తో మాట్లాడి సిడ్బీ బ్యాంకు కాకినాడకు మంజూరు అయ్యేలా కృషి చేశామన్నారు. శ్రీసత్యదేవ క్లస్టర్ ఎండీ కోరుమిల్లి బాలా ప్రసాద్, క్లస్టర్ సెక్రటరీ జీవీఆర్‌మూర్తి, జాయింట్ ఎండీ ఎస్.రాజేష్, ఫణి పూర్ణచంద్రరావు, సిడ్బీ జనరల్ మేనేజర్ వి.చంద్రమౌళి, డీజీఎం టీవిద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై పాట విడుదల

సామర్లకోట, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఆయనను కీర్తిస్తూ సామర్లకోటకు చెందిన అభిమాని దేవగుప్తాపు వీరన్న రచించి గానం చేసిన పాటను జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఆదివారం సామర్లకోటలో ఆవిష్కరించారు. సంధ్యారాణి, పాల్ నవీన్‌బాబు తదితర జనసేన నాయకులు, వీరన్నను అభినందించారు.

'లోవ'కు తగ్గిన భక్తుల తాకిడి

తుని రూరల్, సెప్టెంబరు 1: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి వర్షం ప్రభావంతో భక్తుల తాకిడి తగ్గింది. ప్రతీ ఆదివారం సుమారు 40వేల మంది భక్తులు వస్తుండగా ఆదివారం 4వేలమంది వచ్చినట్టు తెలిసింది. రూ.2.42లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.

పడమటీది నాటకం పుస్తకావిష్కరణ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 1: జగ్గంపేటకు చెందిన ప్రముఖ కవి మిరప మహేష్ కవిత్వం పడమటీది నాటకం పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రముఖ రచయిత అద్దేపల్లి ప్రభు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కవితా సంపుటిని ప్రముఖ సాహితీవేత్త, కవి మోకా రత్నరాజు ఆవిష్కరించగా ముఖ్యఅతిథిగా ప్రసిద్ధ విమర్శకులు, కవి గుంటూరు లక్ష్మీనరసయ్య, పుస్తక సమాలోచన సుంకర గోపాల్ చేశారు. కవులు రామవరపు రాజా, ర్యాలీ శ్రీనివాస్, రహిమొద్దీన్, బడుగు జోగేష్, జగపతి ఉన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల గుంతల పూడ్చివేత

ఎస్పీ చొరవతో ముందుకొచ్చిన జేపీ కనస్ట్రక్షన్



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 1: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు పాడైపోయి గుంతలుగా మారడం.. ఇందులో వాహనదారులు పడి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు, ప్రమాదాలను గుర్తించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జేపీ కనస్ట్రక్షన్స్ నిర్వాహకులు జె.ప్రభాకర్, పీడీ రామకృష్ణను కోరారు. ఎస్పీ సూచన మేరకు జేపీ కనస్ట్రక్షన్స్ ముందుకొచ్చి ఆదివారం లారీపై సిమెంటు, ఇసుక, కంకర తీసుకువచ్చి రోడ్ల మధ్యలో ఉన్న గుంతలను పూడ్చించే కార్యక్రమం చేపట్టారు. కాకినాడ ఎస్డీపీవో రఘువీర్ విష్ణు పర్యవేక్షణల ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్, 1,2 పీఎస్ అధికారులు, సిబ్బంది సహకారంతో అచ్చంపేట జంక్షన్, ఆనంద్ థియేటర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, బలరాంహోటల్, న్యూబ్రిడ్జి సెంటర్, జగన్నాథపురం ఓల్డ్ బ్రిడ్జి, చంద్రిక థియేటర్‌వద్ద రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతలను పెద్ద సిమెంట్ కాంక్రీట్ లారీ లోడు తీసుకువచ్చి సిబ్బంది గోతులను పూడ్చివేశారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రోడ్డు గుంతల పూడ్చివేత పనులను పరిశీలించి జేపీ కనస్ట్రక్షన్ నిర్వాహకులు, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను అభినందించారు. రోడ్డు గుంతలు పూడ్చించేలా చర్యలు తీసుకున్న ఎస్పీ, ట్రాఫిక్ పోలీసులను వాహనదారులు, ప్రయాణికులు అభినందనలు తెలిపారు.